# విపశ్యన మాసపత్రిక

VOLUME : 2 NO - 3 1 JUNE, 2007

(సాధకుల ప్రేరణ కొరకు ఉద్దేశించబడిన తెలుగుమాస పత్రిక)

విపశ్యన అంతర్జాతీయ ధ్యాన కేంద్రం, ధమ్మఖేత్, వనస్థలిపురం, హైదరాబాదు - 70

## "ధర్మవాణి"

| | |
|---|---|
| దానఞ్చ ధమ్మచరియా చ<br>ఞాతకానఞ్చ సఙ్గహో<br>అనవజ్జాని కమ్మాని<br>ఏతం మఙ్గల ముత్తమం<br>- మఙ్గలసుత్తం | దానం చేయడం, ధర్మాన్ని ఆచరించడం, బంధుమిత్రులకు సహాయం చేయడం, నిందారహిత కర్మలను చేయడం, ఇదే ఉత్తమము, మంగళకరము. |

*(గత సంచిక తరువాయి)*

## దానచేతన

*(పూజ్యగురూజీ వ్రాసిన "మంగళ్ జగే గృహీ జీవన్‌మే" హిందీ పుస్తకమునకు తెలుగు అనువాదం "మంగళమయ గృహస్థ జీవితం" నుండి)*

ఎలాంటి దానం సార్థకమవుతుంది?

ఏ దానము ఇవ్వడముతోనైతే మనసు మలినమవకుండా నిర్మలమవుతుందో, ఆ దానమే సార్థకమవుతుంది.

దానమివ్వడం వలన మనసు మలినమవుతుందా?

తప్పకుండా! వివేకం తోడు లేకుండా ఇచ్చిన దానము మనసును మలినపరుస్తుందే గాని నిర్మలం చేయదు. ఏవిధంగానయితే అవివేకి యొక్క శ్రద్ధ, ప్రేమలు అతని బంధనమునకే దారితీస్తాయో, అదేవిధంగా వివేకం లేనివాడి దానముకూడా అతని బంధనమునకే దారితీస్తుంది.

వివేకం లేని వ్యక్తిలో దానమివ్వాలనే శుద్ధ ధర్మచేతన జాగృతమే కాజాలదు. ఇలాంటి వ్యక్తి దానమిచ్చినా దుర్మనస్సుతోనే ఇస్తాడు. అతని మనసు అహంకారము, చిరాకు, ఏవగింపు, ఈర్ష్య, పిసినారితనం, భయముల వంటి దుర్భావనలతోనే నిండివుంటుంది. ఇలాంటి మనసుతో ఇచ్చిన దానం మంచి ఫలాన్నెలా ఇవ్వగలుగుతుంది? దుర్మనసు యొక్క ఫలము దుఃఖదమే అవుతుంది గాని సుఖదము కాదు. వివేకము దానమును నిష్కామమైనదిగా ఉంచుతుంది. సకామ (కోరికలుగల) భక్తిలాగా, సకామప్రేమలాగా ప్రతిఫలాన్ని ఆశింపజేసి చిత్తమును కలుషితం చేయదు. చిత్తము యొక్క పవిత్రత నష్టపోకుండా కాపాడుతుంది. ఒకవేళ దానమిచ్చే ఉద్దేశం పేరు ప్రతిష్ఠలుగాని లోకీయ ప్రతిఫలముగాని లేక ఏ దేవలోకమునకో చెందిన దివ్య సుఖములుగాని అయినట్లయితే, రాగరంజిత చిత్తముతో చేసే ఇలాంటి దానము బంధింపజేసేదే అవుతుంది. అదేగనుక ఈ కుశలకర్మకు త్యాగము, అపరిగ్రహముల రూపమునిచ్చి ఆశ్రవక్షయానికి హేతువుగా తయారు చేసుకుంటే మనమిచ్చేదానము బంధింపజేసేదిగా కానేరదు.

*ఇదం మే పుఞ్ఞకమ్మం ఆసవక్ఖయ వహం హోతు।*

లేదా

*ఇదం మే పుఞ్ఞకమ్మం నిబ్బానస్స పచ్చయో హోతు॥*

వివేకవంతునికి దానం అనే పుణ్యకర్మ ఆస్రవ క్షయానికి, నిర్వాణానికి కారణమవుతుంది. ఎందుకంటే అది అపరిగ్రహం కొరకై ఉంటుంది. బరువును దించుకోడానికే గానీ బరువును పెంచుకోడానికి కాదు. శుద్ధ అపరిగ్రహబుద్ధితో చేసిన దానం లోకోత్తరమైన నిర్వాణ ప్రాప్తినే కాక, లోకీయ లాభాలను కూడా ఇస్తుంది. వరిపంటలో బియ్యానికి తోడుగా వరిపొట్టు, మేతకు గడ్డి వచ్చినట్లుగా, పంచదార కర్మాగారం నెలకొల్పినపుడు పంచదారతో పాటు మొలాసిస్ వచ్చినట్లుగా, శుద్ధదానముకూడా సమస్త మానవీయ, దైవిక సంపత్తులిస్తూనే నిర్వాణ సంపత్తిని కూడా లభింపజేస్తుంది.

*మానుస్సికా చ సమ్పత్తి. దేవలోకే చ యా రతి।*
*యా చ నిబ్బానసమ్పత్తి, సబ్బమేతేన లబ్భతి॥*

- ఖుద్దకపాఠ 8.13 నిధికణ్డసుత్తము

అభిమానరహితమైన మనస్సుతో, మైత్రీ-కరుణాయుక్తమయిన చిత్తముతో, అపరిగ్రహబుద్ధితో ఇచ్చిన దానములు నిర్వాణగాములయిన ఉత్తమ ధర్మాలకు ఆవశ్యకమైన పునాదిని నిర్మిస్తాయి. శుద్ధదానంవల్ల లోకీయమైన, లోకోత్తరమైన రెండు లాభాలు కలుగుతాయి. వివేకవంతుడైన దాత తన దానాల యొక్క ఈ రెండు పక్షాలనూ బహుస్పష్టంగా అర్థం చేసుకుంటాడు. దానం చేసే ముందు తను దానం ఇవ్వాల్సిన ఆవశ్యకత ఏమిటో ప్రజ్ఞాపూర్వకంగా బాగా ఆలోచించి తెలుసుకొంటాడు. బాగా ఆలోచించి తెలుసుకొంటాడు కనుకనే స్వచ్ఛమైన మంచి మనసుతో దానం చేస్తాడు. మంచిమనసుతో చేసిన దాని ఫలం మంచిదే అవుతుంది. అది లోకీయమైనదైనా, లోకోత్తర మైనదైనా సరే!

వివేకవంతుడైన వ్యక్తి తన చుట్టూ ఉన్న అభాగ్యులను చూసి, తనకు ఉన్న దాంట్లో, ముందు వారికి పెట్టి మిగిలితే గాని తను స్వీకరించడు. ఆ ప్రాణులు మనుషులయితే వారి అవసరాలు తీర్చడమే తన భాగ్యమని భావిస్తాడు. తన వద్ద ఉన్నది ఎవరికీ పెట్టకుండా తినడం ధర్మ విరుద్ధమన్న సంగతి అతనికి స్పష్టంగా తెలుసు. తన దగ్గర కొద్దిగా ఉన్నప్పటికీ ఆ కొద్దిలో గూడా ఒకభాగం అభాగ్యులకు పంచి మాత్రమే మిగిలిన భాగాన్ని అనుభవిస్తాడు. చాలావుండినా గూడా ఎవరికీ పంచకుండా స్వయంగా సర్వం అనుభవించడం ఘోరపాపమే అవుతుంది. అలాంటి పనిలో తన అమంగళం, పరాభవం, పతనమే నిండి వుందని అతనికి తెలుసు.

*పహూతవిత్తో పురిసో, సహిరఞ్ఞో సభోజనో।*
*ఏకో భుఞ్జతి సాదూని, తం పరాభవతో ముఖం॥*

- సుత్తనిపాత 102, పరాభవసుత్తము.

- ఎవరి దగ్గరయితే అత్యధికంగా ధన, ధాన్య సంపదలుంటాయో, వెండి బంగారాలు, ధాన్య బండారాలుంటాయో వాటిని అతనొక్కడే అనుభవించడం అతని పతనానికి కారణమవుతుంది.

వివేకవంతుడైనవాడు ఈ తప్పు చెయ్యడు. ఇలాంటి పతనంనుండి జాగ్రత్తపడతాడు. మానవుడు ఒక సామాజికప్రాణి అనీ, ఒక సమూహంలో జీవించేవాడనీ వివేకవంతుడు తెలుసుకుంటాడు. "నేను అందరి నుండి అనేక రకాలుగా సుఖ సౌకర్యాలను పొందుతున్నాను. మరి నావంతుగా అందరి సుఖ సౌకర్యార్థం నేనేమైనా చేస్తున్నానా? ఒకవేళ నా వద్ద ఏదయినా అవసరానికి మించి ఉంటే, దాన్ని ఇతరులకు పంచి నాబాధ్యత నిర్వహించిన వాడినవుతాను", అని తాను ఏ సామాజిక వ్యవస్థలో ఉంటాడో, ఆ సామాజిక వ్యవస్థ పురాతన ధర్మపరంపరను నిభాయిస్తాడు. సామాజిక వ్యవస్థలో ఆర్థిక అసమానతలు ఉండడం స్వాభావికం. ఈ అసమానతలు వ్యవస్థలోని అనివార్య దోషాలు. సమాజంలో ఉంటూ ఈ వ్యవస్థలోని దోషాలను ఎంత దూరం చేయగలిగితే అంత చేస్తూ ఉండాలి. దీనికై పురాతన కాలంలో యజ్ఞ విధానముండేది. ప్రతిఒక్కరూ యజ్ఞాలు చేసేవారు. అనగా త్యాగాలు చేసేవారు. తమ వద్ద నిలువవున్న ధనసంపత్తులను త్యాగం చేసేవారు, పంచిపెట్టేవారు. ఆ తరువాతే తాము వాటి సుఖాన్ని అనుభవించేవారు. అనావశ్యక పరిగ్రహం నుండి తప్పించుకుంటూ, పరాయి వస్తువులను లోభదృష్టితో చూడకుండా ఉండేవారు. కానీ, రాను

రాను వివేకం నశించింది. స్వేచ్ఛతో ప్రజ్ఞాపూర్వకంగా తన వద్ద అవసరానికి మించివున్న సంపదను ఇతరులకు ఇవ్వాలనే జ్ఞానం క్షీణించిపోతూ వచ్చింది. దానప్రసిద్ధి తగ్గుతూ పోయింది. దీనిని పునరుజ్జీవితం చెయ్యడానికి, కొందరు సమాజసంస్కర్తలు దీనికి దైవభక్తిని జోడించి, "దేవీ దేవతలను సంతోష పరచడానికి యజ్ఞాలు చేయండి. త్యాగాలు చేయండి. ఎవరి వద్ద ఏమేమి జమపడి ఉన్నాయో, వాటిని త్యాగం చేయండి. 'దేవతల పేరుతో త్యాగం చేయండి', దానమివ్వండి." అనే ఆనవాయితీని ప్రవేశపెట్టారు. దేవతల పేరున ఏదైతే త్యాగం చేయబడుతుందో అది సమాజంలో పంచి పెట్టబడుతుంది. ఈవిధంగా సమవిభాగపు ఈ కల్యాణకారియగు రీతిరివాజులు దైవయజ్ఞాల పేరున నడిపింపబడి ఉంటాయి. పశుపోషణ - వ్యవసాయం ప్రధానమైన సమాజంలో, ఎవరి దగ్గరయితే అధిక సంఖ్యలో పశువులు ఉంటాయో, ఎవరివద్ద అధికంగా ధాన్యం చేరుతుందో, వారు వివేకవంతులై యజ్ఞాలలో ప్రజలకు పశువులు మరియు ధనధాన్యాలను పంచి పెట్టేవారు. ఎప్పుడయితే యజ్ఞము దేవతల పేరుతో చేయబడుతుందో, అప్పుడు యజమాని వాటిని దేవతలకు దానమిచ్చేవాడు. అంటే అర్పితం చేసేవాడు. ఈవిధంగా సమాజంలోని వారికి అది పంచబడేది. అందువల్ల సామాజిక అసమానతలు పెరిగేవి కావు. రాను రాను ఈ ఆనవాయితీలలో భిన్న భిన్న విధాలుగా వికృతులు, దోషాలు చోటుచేసుకుంటూ వచ్చాయి. తిరిగి వాటిని సరిదిద్దడమూ జరుగుతూ వుండేది. దాత ఎప్పుడెప్పుడు తన వివేకం కోల్పోయేవాడో అప్పుడు తన మనోనిర్మలతనూ కోల్పోయేవాడు. దానివల్ల దానం యొక్క పవిత్రతకు నష్టం జరిగేది. ఎప్పుడెప్పుడు అతని వివేకం జాగృతమయ్యేదో, అప్పుడప్పుడు అతను తన దానాన్ని సార్థకం చేసేవాడు. సుఫలదాయినిగా చేసేవాడు.

వివేకవంతుడైన వ్యక్తి , దానం అపరిగ్రహానికని తెలుసుకుంటాడు. ఎవరైనా ఒకరివద్ద ఎక్కువ జమకూడిందంటే, మిగతావారికి దాని లేమిని భరించాల్సి వస్తుంది. అందువల్ల అప్పుడప్పుడు అపరిగ్రహబుద్ధితో, కర్తవ్య బుద్ధితో, అహంకార రహితంగా తన వద్దనున్న సంపదను ఇతరులకు పంచుతూ ఉండాలి. దానితో సమాజములోని అసమానతలు పెరగకుండా ఉంటాయి. తద్వారా కలహాలు - విరోధాలు పెరగకుండా ఉంటాయి. ఇలా దానం ఇవ్వడం వల్ల భారగ్రస్తుడు భారవిముక్తుడవుతాడు. లేనివాడు ఉన్నవాడవుడతాడు.

దానం అవసరమైన వారికి మాత్రమే ఇవ్వాలి. కాని వారిలో గూడా పాత్రుణ్ణి, యోగ్యుణ్ణి ఎన్నుకోవాలి. ఎలాగయితే సారవంతమయిన భూమిలో నాటిన విత్తనం మంచి ఫలాన్నిస్తుందో, అలాగే యోగ్యమైనచోట చేసిన దానం మహాఫలదాయకమవుతుందని వివేకవంతుడు గ్రహిస్తాడు. ఏ భూమి ఎగుడు దిగుడుగా ఉంటుందో, ఏ భూమిలో ఎక్కువ కలుపు మొక్కలున్నాయో, చెట్లూ పొదలూ ఉన్నాయో, ఎక్కడ రాళ్ళూరప్పలున్నాయో, ఏ నేలను దున్నలేదో, ఏది మరీ రాతిపొలమో, దేనిలో నీళ్ళు పారేదారే లేదో, దేనిలో చేనుగట్టులేదో, అలాంటి పనికిమాలిన పొలంలో నాటిన విత్తనం ఫలదాయకం కాలేదని అతనికి తెలుసు. అదేవిధంగా ఏ వ్యక్తి మాటలు శుద్ధమైనవికావో, ఎవరి శారీరకకర్మలు శుద్ధమైనవికావో, ఎవరి జీవన విధానము పరిశుద్ధముకాదో, ఎవరి ప్రయత్న-ప్రయాసలు శుద్ధాలుకావో, ఎవరి స్మృతి శుద్ధంకాదో, ఎవరి సమాధి శుద్ధంకాదో, ఎవరి చింతన మననలు శుద్ధంకావో, ఎవరి దృష్టి- దర్శనాలు శుద్ధాలుకావో, అలాంటి దుర్జనుడు, దుశ్శీలుడు, దురాచారుడు, దుఃసమాధిస్థితుడు మరియు దుష్ప్రజ్ఞ గలవాడైన వ్యక్తికి ఇవ్వబడిన దానం ఫలదాయకం కానేరదు.

ఏ పొలమైతే సమతలంగా ఉందో, చెట్లు చేమలు, తుప్పలు, కలుపులేనటువంటిదో, ఏది రాయి-రప్పలతో నిండిలేదో, ఏదైతే బాగా దున్నబడిందో, దేనిలో నీళ్ళు రావడానికి అవకాశముందో, దేనిలో నీరు బయటకు పోవడానికి వీలుందో, దేంట్లో కాలువ ఉందో, చేను గట్టుఉందో, అటువంటి సారవంతమైన పొలంలో నాటిన విత్తనం నిజంగానే మహాఫలదాయిని అవుతుంది. సరిగ్గా ఈవిధంగానే ఏ వ్యక్తి మాట శుద్ధంగా ఉంటుందో, శారీరకకర్మ శుద్ధంగా ఉంటుందో, జీవనవిధానం శుద్ధమయిందో, ప్రయత్న ప్రయాసలు శుద్ధమైనవో, స్మృతి శుద్ధమైనదో, సమాధి శుద్ధమైనదో అలాంటి సజ్జనుడు, సుశీలుడు, సదాచారి, సుసమాహితచిత్తుడు, ప్రజ్ఞావంతుడైన వ్యక్తికి సముచితంగా ఇచ్చిన దానం మహాఫలదాయిని అవుతుంది. ఆ వ్యక్తి ఏ జాతి, కుల, వర్ణ, వర్గ, సంప్రదాయానికి చెందిన వాడైనా, అతడు అన్ని విధాలుగా శ్రమణుడే; బ్రాహ్మణుడే; పవిత్రుడే; పావనుడే. అలాంటి ధర్మమార్గంలో పయనిస్తున్న వ్యక్తి. దాన బీజాన్ని నాటడానికి ఎంతో సారవంతమైన పుణ్యక్షేత్రము. ధర్మమార్గంలో నడిచే ఈ వ్యక్తి చిత్త విశుద్ధి యొక్క ప్రథమ స్థితిని లభింపజేసుకొని ముక్తి యొక్క స్రోత యందు పడినపుడు, స్రోతాపన్నుడై మహత్తర పుణ్యక్షేత్రమై పోతాడు. అతడు పురోగమిస్తూ, తన అంతరంగంలోని సూక్ష్మమైన బంధాలనుండి గూడా ముక్తి పొందుతూ 'సకృదాగామీ' గా, 'అనాగామీ' గా మరింత సారవంతమైన పుణ్యక్షేత్రమవుతాడు. ఈ వ్యక్తి ఎప్పుడు అరహంతుడవుతాడో, స్థితప్రజ్ఞుడై, జీవన్ముక్తుడై సర్వ గ్రంథుల నుండి సంపూర్ణంగా విముక్తి పొంది నిర్గ్రంథుడై, సర్వ వికారాలను జయించి బుద్ధుడయి, అనుత్తర సమ్యక్ సంబోధి ప్రాప్తినొంది, సమ్యక్ సంబుద్ధుడవుతాడో, అప్పుడు పవిత్రత యొక్క సర్వోత్తమ అవస్థకు చేరుకొని. మహోత్తమ సారవంతపుణ్యభూమిగా మారిపోతాడు.

వివేకవంతుడైన దాతకు - 'ధర్మవంతుడైన వ్యక్తి మానవ సమాజానికి అమూల్య సంపద' అని తెలుసు. ఆ వ్యక్తి స్వయంగా సుఖ శాంతులతో జీవించడమే కాకుండా ఇతరుల సుఖ శాంతికిగూడా కారణమవుతాడు. ఇతరులుగూడా ధర్మవంతులయ్యేలా ప్రేరణనిస్తాడు. మార్గదర్శకుడవుతాడు. అందువల్లే, అతను ఎంతెంత ఎక్కువగా ధర్మవంతుడవుతాడో సమాజానికి అంతంతగా ఉపయోగపడతాడు. కళ్యాణకారకుడవుతాడు. అంతంతగా పూజ్యనీయుడు, వందనీయుడు అవుతాడు. ఆదరసత్కారాలకు యోగ్యుడవుతాడు. దాన - దక్షిణలకు యోగ్యుడవుతాడు.

ఏ సమాజంలోనైతే శీల-గుణ సంపన్నుడైన ధార్మికవ్యక్తికి అవహేళన, అవమానాలు జరుగుతాయో, మరియు శీల-గుణ హీనుడి యొక్క జాతి, కులం, గోత్రం, ధనం, బలం మొదలగువానిని బట్టి గౌరవ సన్మానములు జరుగుతాయో, ఆ సమాజంలో ధర్మాన్ని కించపరచడం జరుగుతుంది. దాని పరిణామంగా ఆ సమాజం ధర్మవిముఖమవుతుంది. ఆ సమాజంలో న్యాయము. నైతికవిలువలు దిగజారిపోతాయి. ఆ సమాజపు జనం మిథ్యాభిమానాల ఉచ్చులో చిక్కుకొని, తమ పతనానికి తామే కారకులవుతారు.

*జాతిత్థద్ధో ధనత్థద్ధో, గోత్తత్థద్ధో చ యో నరో।*
*సఞ్ఞాతిం అతిమఞ్ఞేతి, తం పరాభవతో ముఖం॥*

- సుత్తనిపాత 104, పరాభవసుత్తము.

- ఎవరైతే జన్మ, జాతి, ధనసంపద, కులగోత్రాల అహంకారంతో, సమాజంలోని ఇతర జనాన్ని నిరాదరంగా చూస్తాడో, అతను తన పతనానికి తానే కారణమౌతాడు.

వివేకవంతుడైన వ్యక్తి, ఎవరయినా ధర్మనిష్ఠుడైన మహానుభావునికి దానం చేసినపుడు అతని మనస్సు శ్రద్ధాభావంతో, దాక్షిణ్యభావంతో నిండి, ఆ స్థితిలో, ' ఈ మహాపురుషుడు నా దానం స్వీకరించి, నన్ను ధన్యుడ్ని చేశాడు', అని అర్థంచేసుకుంటాడు. మరోవైపు అతడు ఎవరైనా ధర్మవిహీనునికి దానం చేసినట్లయితే, తన మిథ్యాహంకారాలను పోషిస్తూ, తానే అతనిపై దయచూపించాడనే భావనతో ఉంటాడు. ధర్మహీనుడినికి కాకుండా ధర్మవంతుడికి దానం చెయ్యడం వల్ల మనస్సు అధికంగా నిర్మలమవుతుంది . ఆ దానం అధిక ఫలదాయకమవుతుంది.

వివేకవంతుడైన వ్యక్తి, 'సమాజం వ్యక్తి కంటే మించినదని తెలుసుకుంటాడు. వ్యష్టి కంటే సమిష్టి గొప్పది. ఒక విశేషవ్యక్తికి సమర్పించిన ప్రత్యేక దాన సేవకంటే, సార్వజనీనమైన దాన-సేవ అధిక ఫలదాయకమవుతుంది. ఒక వ్యక్తి పరమజ్ఞాని, సమ్యక్ సంబుద్ధుడే కావచ్చు . కానీ అతనికి బదులు వ్యక్తుల సమూహమైన సంఘానికి చేసిన దానసేవ ఎక్కువ ఫలితాన్నిస్తుంది. అది ధర్మనిరతుల సంఘమైతే, సంతుల సంఘమైతే, సాధకుల సంఘమైతే ఇక చెప్పాల్సిందేముంది ! దాన బీజం నాటడానికి ఇంతకు మించిన సారవంతమయిన క్షేత్రముండదు. అది బహు ఉత్తమమైన పుణ్య క్షేత్రం'.

వివేకవంతుడైన వ్యక్తి, సరైన సమయంలో చేయబడ్డ దానపు విశిష్టతను తెలుసుకుంటాడు. కష్టకాలంలో- అగ్ని ప్రమాదంలో, వరదల్లో, మహమ్మారి సోకినప్పుడో పీడిత జనానికి చేసిన దానం, ఆకలిగొన్నవానికి చేసిన అన్నదానం, గుడ్డలు లేనివానికి చేసిన వస్త్రదానం, రోగికిచ్చిన ఔషధదానం, నిలువ నీడ లేనివానికి చేసిన గృహదానం యొక్క విశిష్టతను తెలుసుకుంటాడు. కానీ, ఈ సమయానుకూల దానాల కంటే, ఏ ప్రత్యేక సమయానికీ సంబంధంలేకుండా ఇచ్చే దానమే ఉత్తమమైనది. అది సార్వకాలిక దానం. ధర్మదానం. అది సర్వదా సర్వహితకారకమైన దానం.

**"సబ్బదానం ధమ్మదానం జినాతి"**

"అన్ని దానముల కన్న ధర్మదానం మహోన్నతమైనది".

(ధమ్మపాద 354, తణ్హావగ్గ)

ఎవరికైనా ధర్మదానం చేయడమంటే అతనికి ఏదో విశేష సంప్రదాయంలో దీక్షనివ్వడం కాదు. సార్వకాలిక, సార్వదేశిక ధర్మం ఎప్పుడూ సార్వజనీనమై ఉంటుంది. అది ఏదో ఒక సంప్రదాయమనే క్షుద్రపరిధిలో బంధింపబడలేదు. కాబట్టి, ధర్మదానం చేయడమంటే, అది ఏ సాంప్రదాయపు బంధముతోనో పెనవేయటానికి కాదు. అందుకు భిన్నంగా, సాంప్రదాయపు బంధమునుండి పైకిలాగి, శీల-సమాధి-ప్రజ్ఞలలో స్థిరపరచుటకై ఉంటుంది. ప్రజలను జాతి, కులం, గోత్రం, ధనం, అధికారాల వంటి సంకుచిత పరిధినుండి బయటకులాగి, వారిని శుద్ధధర్మపు మహత్తరమైన క్షేత్రంలో స్థాపింపజేయడం

కోసమై ఉంటుంది. ఎవరైనా శీలవంతుడు కాకపోతే అతనిని శీలంలో స్థాపించడానికి, శీలవంతుడై సమాధి స్థితుడు కాలేకపోతే అతనిని సమాధిలో స్థాపించడానికి, శీలవంతుడై, సమాధిస్థితుడై, ప్రజ్ఞావంతుడు కాకపోతే అతనిని ప్రజ్ఞలో స్థాపించడానికి, అతనికి విముక్తి రసాస్వాదన చేయించడానికి, నిర్వాణ సాక్షాత్కారం చేయించటానికై ఉంటుంది. వీటికి సహాయకారి కావడమే ధర్మదానం యొక్క నిజమైన అర్థం. అది అందరికీ సమానంగా, సర్వదా కల్యాణకారకమౌతుంది.

ధర్మదానం ప్రారంభంలో పుస్తకాల ద్వారా, ప్రవచనాల ద్వారా, ధర్మ సందేశాల ద్వారా ప్రజలవద్దకు చేర్చాల్సి ఉంటుంది. దానివల్ల వారిలో ధర్మంపట్ల ఆకర్షణ జనిస్తుంది. ధర్మధారణ చెయ్యాలనే ప్రేరణ కలుగుతుంది. మార్గదర్శకమౌతుంది. శృతధర్మం, పరియత్తి ధర్మమైన ఈ దానం లాభదాయకమైనది. కానీ దీనికంటే ఉత్తమమైనది ధర్మధారణచేసే అభ్యాసం చేయించడం. దీనివల్ల ప్రతి వ్యక్తికీ వాస్తవమైన క్రియాశీలక లాభం కలుగుతుంది. ఈ దానం ఏదో ఒక వ్యక్తికో, వర్గానికోకాకుండా, సార్వజనీన మైనప్పుడు అది సర్వోత్తమ ఫలదాయని అవుతుంది.

ధర్మదానంలో శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా సహాయపడడం, దానిలో భాగం వహించడమౌతుంది. వివేకవంతుడైనవాడు తనకు ధర్మం నేర్పించే సామర్థ్యం లేనపుడు, దాని శిక్షణాకార్యక్రమంలో పాల్గొని సేవాలబ్ధిని పొందగలడు. ధర్మం నేర్పించేవారికి భోజన, వసతి, నివాసం, ఇతర సౌకర్యాలు కల్పించడంలో సహాయపడి, ధర్మశిబిరాలలోను, ఇతర సేవలలోను పాల్గొంటూ శుద్ధధర్మదానాలలో భాగస్థులు కావచ్చు. సాధకులకు భోజన, సౌకర్యాల దానం, ధ్యాన కుటీరపు దానం, ఇతర ఆవశ్యక సౌకర్యాల దానం ధర్మదానమే అవుతుంది. దీనితోబాటు వివేకవంతుడైన వ్యక్తి అన్ని దానాలలోకి అత్యున్నతమైన దానం, తాను ధర్మంలో సుస్థిరంగా ఉండటమే; స్వయంగా శీల, సమాధి ప్రజ్ఞలలో స్థాపితమై ఉండడం; స్వయంగా ఆధ్యాత్మికం వైపుకు తాను ముందుకు వెళ్ళడం అధిక ఫలదాయకమని తెలుసుకుంటాడు. దానాన్నే సర్వస్వమని భావించి, అధ్యాత్మిక మార్గంలో తరువాతి మజిలీలు చేరకుండా అడ్డగోడలు నిలబెట్టుకునే ప్రమాదంలో పడకూడదు. దానధర్మాల యొక్క మొట్టమొదటి అడుగు అత్యవసరమైన అడుగేగాని అంతం కాదు. మొదటి అడుగే బలహీనమైనదైతే తరువాతి అడుగులు స్థిరంగా పడవు. ఈ విషయాన్ని తెలుసుకున్న వివేకవంతుడైన వ్యక్తి, ధర్మమార్గాన ప్రయాణం చేయాలనుకున్న వ్యక్తి, ధర్మజీవనంయొక్క సుఖ-శాంతులను పొందాలనుకున్న వ్యక్తి, ధర్మం యొక్క ఆఖరు మజీలీ చేరాలనుకున్న వ్యక్తి, ఈ దానాన్ని తన జీవితంలో ఒక అనివార్యమైన ఆవశ్యక అంగంగా మార్చుకుంటాడు. దానికి తోడుగా శీల-సమాధి -ప్రజ్ఞలలో సరైనవిధంగా పుష్టి చెందుతూ పోతాడు.

దానాన్ని జీవితంయొక్క ఆవశ్యక అంగంగా మార్చుకోవాలనుకున్న ప్రతి విపశ్యనా గృహస్థసాధకుడూ, ఆదాయంలో తన శక్తికి తగ్గట్లు ప్రతిరోజు లేక ప్రతి సంవత్సరం తన ఆదాయంలో ఎంతో కొంత భాగాన్ని శుద్ధధర్మము కొరకు ప్రక్కన పెట్టడం అవసరం. ఎవరి ఆదాయం తక్కువగా ఉంటుందో వాళ్ళు అందులోనే కొద్దిగా పక్కన పెట్టడంలో హీనభావం ఉండనవసరంలేదు. చిత్తంయొక్క శుద్ధదాన చేతనమే ఫలితాన్నిస్తుంది గాని ఇచ్చిన దానము యొక్క పరిమాణము కాదు. కావున సమర్థులైన వారు తమ దానచేతనను సంకుచిత పరచుకొని, దానిని కలుషితం చేయగూడదు. ఉదార బుద్ధితో, డాబుసరిలేని చిత్తంతో దానం చేయడం నేర్చుకోవాలి.

అయితే దానాన్ని ఎక్కడ ఇవ్వాలి? మన ధర్మప్రజ్ఞ ఎక్కడ ఉత్సాహభరితమౌతుందో, ఎక్కడ దానచేతనము జాగృతమౌతుందో, అక్కడ మనం దానంచెయ్యాలి. కానీ తప్పకుండా చేయాలి! ఎవరైతే గృహత్యాగులో, వారు బహుజనులహితం కోసం, బహుజనుల సుఖం కోసం శుద్ధమైన నిరామిషమైన ధర్మదానం చేయడంలో, తగిన సామర్థ్యాన్ని లభింపచేసు కోవడంలో పురోగమిస్తూపోవాలి. ఎవరికైతే సామర్థ్యం ఉందో వారు శుద్ధధర్మదానం చేస్తూపోవాలి. శుద్ధసాత్విక ధర్మదానం సాధకుని చిత్తానికి ఆభరణం లాంటిది. అది చిత్తానికి అలంకారం. చిత్తాన్ని తేలికగా ఉంచుతుంది. దాన చేతనను మేల్కొల్పుకొని మీ మనసులను ధర్మవిభూషితం చేసుకోండి. దానిని మంగళ మార్గగామినిగా తయారుచేసుకోండి.

## పరాభవ సుత్తం

విజ్ఞానవంతుడైన గృహస్థుడు మంగళకర్మలలో నిరతుడై తన ఉన్నతికై ఎలా పాటుపడతాడో, అలాగే అజ్ఞానుడైన గృహస్థుడు మంగళకర్మలనుండి విరతుడై అమంగళ కర్మలలో నిరతుడై పతనమౌతాడు. పతనోన్ముఖుడు కావడానికి కారణాలను ఒకసారి ఎవరో అడుగగా, భగవానుడు ఇలా తెలియ జెప్పాడు.

*పరాభవన్తం పురిసం, మయం పుచ్ఛామ గోతమ।*
*భగవన్తం పుట్ఠుమాగమ్మ, కిం పరాభవతో ముఖం॥*

ఓ గౌతమ, పతనంవైపుకు ప్రయాణంచేసే పురుషుని విషయమై అడుగడానికి మేము వచ్చాము. అధోగతికి కారణాలేమిటో సెలవివ్వండి?

**భగవానుడు -**

***సువిజానో భవం హోతి, సువిజానో పరాభవో।***
***ధమ్మకామో భవం హోతి, ధమ్మదేస్సీ పరాభవో॥***

ఉన్నతశీలుడైన వ్యక్తిని గుర్తించుట సులభం. పతనమార్గంలో ఉన్నవానిని గుర్తించడంకూడా సులభమే. ధర్మ ప్రియునికి ఉన్నతి జరుగుతుంది. ధర్మద్వేషి పతనమౌతాడు.

***అసన్తస్స పియా హోన్తి, సన్తే న కురుతే పియం।***
***అసతం ధమ్మం రోచేతి, తం పరాభవతో ముఖం॥***

ఎవరికి దుర్జనులు ప్రియులుగా, సజ్జనులు అప్రియులుగా ఉంటారో, ఎవరికి దుర్జనుల ప్రవర్తన ఇష్టంగా ఉంటుందో, ఈ గుణాలే వారి పతనానికి కారణాలవుతాయి.

***నిద్దాసీలీ సభాసీలీ, అనుట్ఠాతా చ యో నరో।***
***అలసో కోధపఞ్ఞాణో, తం పరాభవతో ముఖం॥***

ఎవడైతే నిద్రాలోలుడో, సభలు-సమారోహాలంటూ తిరుగుతుంటాడో, నిరుద్యోగి, సోమరి, కోపిష్ఠి అయిన వాడు, తన పతనానికి తానే కారణమవుతాడు.

***యో మాతరం పితరం వా, జిణ్ణకం గతయోబ్బనం।***
***పహు సన్తో న భరతి, తం పరాభవతో ముఖం॥***

ఎవరు సంపన్నుడైవుండి గూడా బలహీనులైన తన వృద్ధ తల్లితండ్రుల భారం వహించడో, వారి పాలన పోషణలను చూడడో, అతడు తన పతనానికి తానే కారణమవుతాడు .

***యో బ్రాహ్మణం సమణం వా, అఞ్ఞం వా పి వనిబ్బకం।***
***ముసావాదేన వఞ్చేతి, తం పరాభవతో ముఖం॥***

ఎవడైతే శ్రమణులకు, బ్రాహ్మణులకు ఇంకా ఇతర యాచకులకు ఏమీ ఇవ్వగూడదనే ఉద్దేశ్యంతో, అబద్ధం చెప్పి మోసం చేస్తాడో అతడు తన పతనానికి తానే కారణమవుతాడు.

***పహూతవిత్తో పురిసో, సహిరఞ్ఞో సభోజనో।***
***ఏకో భుఞ్జతి సాదూని, తం పరాభావతో ముఖం॥***

ఎవరి దగ్గరయితే చెప్పుకోదగినంత సంపదలుండి, వెండి బంగారాలు, భోజన సామగ్రులన్నీ ఉండిగూడా, తానొక్కడే రుచికరమైన పదార్థాలను భుజిస్తాడో అతడు తన పతనానికి తానే కారణమవుతాడు.

***జాతిత్థద్ధో ధనత్థద్ధో, గోత్తత్థద్ధో చ యో నరో।***
***సఞ్ఞాతిం అతిమఞ్ఞేతి, తం పరాభవతో ముఖం॥***

ఎవడైతే తన జాతి, ధనసంపదలు మరియు గోత్రంపై గల అభిమానంతో, అహంకారంతో తన బంధువులను నిరాదరిస్తాడో, అతడు తన పతనానికి తానే కారణమవుతాడు.

***ఇత్థిధుత్తో సురాధుత్తో అక్ఖధుత్తో చ యో నరో।***
***లద్ధం లద్ధం వినాసేతి, తం పరాభవతో ముఖం॥***

ఎవరైతే స్త్రీలోలుడై త్రాగుడులో, జూదంలో మునిగితేలుతుంటాడో అతడు తన సర్వసంపాదననూ కోల్పోయి పతనమౌతాడు.

***సేహి దారేహి అసన్తుట్ఠో, వేసియాసు పదుస్సతి।***
***దుస్సతి పరదారేసు, తం పరాభవతో ముఖం॥***

ఎవడైతే భార్యపట్ల అసంతుష్టుడై, వేశ్యాలోలుడు మరియు పరస్త్రీలోలుడవుతాడో అతడు తన పతనానికి తానే కారణమవుతాడు.

***అతీతయోబ్బనో పోసో, ఆనేతి తింబరుత్థనిం।***
***తస్సా ఇస్సా న సుపతి, తం పరాభవతో ముఖం॥***

ఎవడైతే వృద్ధుడై ఉండిగూడా నవయువతిని భార్యగా తెచ్చుకుంటాడో, అతడు ఆమెపట్ల అవిశ్వాసం, ఈర్ష్యవల్ల నిద్రపోలేక తన పతనానికి తానే కారణమవుతాడు.

***ఇత్థిం సోణ్డిం వికిరణిం, పురిసం వా పి తాదిసం।***
***ఇస్సరియస్మిం ఠపేతి, తం పరాభవతో ముఖం॥***

ఎవరైతే దురాశ మరియు ఆస్తి నష్టం చేసే స్త్రీకి గానీ, పురుషునికి గానీ, ఆస్తిపై అధిగారమిస్తారో, వారు తమ పతనానికి తామే కారణమవుతారు.

*అప్పభోగో మహాతణ్హో, ఖత్తియే జాయతే కులే।*
*సో చ రజ్జం పత్థయతి, తం పరాభవతో ముఖం॥*

క్షత్రియ కులంలో జన్మించిన అల్ప సంపదశాలి, మహాలోభి అయిన వాడు రాజ్యాన్ని కాంక్షిస్తే , అతడు తన పతనానికి తానే కారణమవుతాడు.

*ఏతే పరాభవే లోకే, పణ్డితో సమవేక్ఖియ।*
*అరియో దస్సనసంపన్నో, స లోకం భజతే సివన్తి॥*

బుద్ధిమంతుడైన వ్యక్తి, లోకంలో పతనానికి దారితీసే ఈ కారణాలను బహుజాగ్రత్తగా అర్థం చేసుకుని, ఆర్యదర్శన సంపన్నుడవుతాడు. అతడు ఇదే జన్మలో నిర్వాణ లాభుడవుతాడు.

– సుత్తనిపాత 91.114 పరాభవసుత్తము.

## మెత్తానిసంస సుత్తము

బోధిసత్త్వుడు తన పూర్వ జన్మలో తేమియ రాకుమారునిగా జన్మించిఉన్నప్పుడు తన సారథి అయిన సునందునకు మైత్రీధర్మం, మెత్తభావనల ఉపదేశాన్నిచ్చారు. ఈ మెత్తభావన ప్రతి విపశ్యీగృహస్థ సాధకునికి అపరిమితమయిన ప్రేరణ కలుగజేసే సుత్తం.

*పహూతభక్ఖో భవతి, విప్పవుట్ఠో సకం ఘరా।*
*బహూ నం ఉపజీవన్తి, యో మిత్తానం న దుబ్భతి॥*

ఎవరు తమ మిత్రులకు నమ్మకద్రోహం చేయరో వారు తమ ఇంటినుండి దూరదేశాలకు వెళ్ళినాసరే అన్నపానీయాల కొరత ఉండదు. వారు ఎంతో ధనం సంపాదిస్తారు, ఎంతోమంది జీవనోపాధికి ఆధారమవుతారు.

*యం యం జనపదం యాతి, నిగమే రాజధానియో।*
*సబ్బత్థ పూజితో హోతి, యో మిత్తానం న దుబ్భతి॥*

ఎవరు తమ మిత్రులకు నమ్మకద్రోహం చేయరో వారు ఏ దేశానికి వెళ్ళినా, ఏ పట్టణానికి వెళ్ళినా, ఏ రాజధానికి వెళ్ళినా సర్వత్రా గౌరవింపబడతారు.

*నాస్స చోరా పసహన్తి, నాతిమఞ్ఞన్తి ఖత్తియా।*
*సబ్బే అమిత్తే తరతి, యో మిత్తానం న దుబ్భతి॥*

ఎవరు తమ మిత్రులకు నమ్మకద్రోహం చేయరో, వారిని దొంగలు బాధించరు. శాసకులు వారిని అనాదరణ చేయరు. వారు తమ శత్రువులందరిపైనా విజయం సాధిస్తారు.

*అక్కుద్ధో సఘరం ఏతి, సభాయం పటినన్దితో।*
*ఞ్ఞాతీనం ఉత్తమో హోతి, యో మిత్తానం న దుబ్భతి॥*

ఎవరు తమ మిత్రులకు నమ్మకద్రోహం చేయరో, వారు శాంతచిత్తంతో ఇంటికి తిరిగివస్తారు. సభలలో వారికి గౌరవం లభిస్తుంది. బంధువులలో వారు ఉత్తములుగా పరిగణింపబడతారు.

*సక్కత్వా సక్కతో హోతి, గరూ హోతి సగారవో।*
*వణ్ణకిత్తిభతో హోతి, యో మిత్తానం న దుబ్భతి॥*

ఎవరు తమ మిత్రులకు నమ్మకద్రోహం చేయరో, వారు ఇతరులను సత్కరిస్తారు. మరియు స్వయంగా సత్కరింపబడుతారు. ఇతరులకు గౌరవమిస్తారు మరియు తాము గౌరవాన్వితులవుతారు. ప్రజలలో ప్రసిద్ధిని పొందుతారు.

*పూజకో లభతే పూజం, వన్దకో పటివన్దనం।*
*యసో కిత్తిఞ్చ పప్పోతి, యో మిత్తానం న దుబ్భతి॥*

ఎవరు తమ మిత్రులకు నమ్మకద్రోహం చేయరో వారు, ఇతరులను, పూజిస్తారు మరియు తాము పూజితులవుతారు. ఇతరులకు నమస్కరిస్తారు మరియు తాము వందనలాభులవుతారు. వారి గుణాలను ఇతరులు అనుకరిస్తారు. వారి కీర్తి నలుదిశలా వ్యాపిస్తుంది.

*అగ్గి యథా పజ్జలతి, దేవతావ విరోచతి।*
*సిరియా అజహితో హోతి, యో మిత్తానం న దుబ్భతి॥*

ఎవరు తమ మిత్రులకు నమ్మకద్రోహం చేయరో, వారు అగ్నిశిఖలవలె ప్రకాశిస్తూ ఉంటారు. దేవలతలవంటి తేజస్సు గలవారవుతారు. సిరిసంపదలతో వైభవ సంపన్నులవుతారు.

*గావో తస్స పజాయన్తి, ఖేత్తే వుత్తం విరూహతి।*
*వుత్తానం ఫలమస్నాతి, యో మిత్తానం న దుబ్భతి॥*

ఎవరు తమ మిత్రులకు నమ్మకద్రోహం చేయరో, వారి గోసంపద వృద్ధిచెందుతుంది. పొలంలో నాటిన విత్తులు మంచి పంటనిస్తాయి. వాటి ఫలాలను వారు అనుభవిస్తారు.

*దరితో పబ్బతాతో వా, రుక్ఖాతో పతితో నరో।*
*చుతో పతిట్ఠం లభతి, యో మిత్తానం న దుబ్భతి॥*

ఎవరు తమ మిత్రులకు నమ్మకద్రోహం చేయరో, వారు పొరపాటున కొండపై నుండి పడినా, గోతిలో పడినా, చెట్టుపై నుండి జరిపడినా ఏదో ఒక ఆధారం వారికి సహాయంగా లభిస్తుంది. వారు గాయాల నుండి తప్పించుకుంటారు.

*విరూళ్హమూలసన్తానం, నిగ్రోధమివ మాలుతో।*
*అమిత్తా నప్పసాహన్తి, యో మిత్తానం న దుబ్భతి॥*

ఎవరు తమ మిత్రులకు నమ్మకద్రోహం చేయరో, బలంగా వేళ్ళూనిన మర్రి చెట్టును తుఫానుగాలి ఏమి చేయలేనట్లుగానే, వారిని శత్రువులు ఏమీ చేయలేరు.

– జాతక 2.22. 12-21, ముగపక్ఖజాతక (538)

*భవతు సబ్బ మఙ్గలం*

– సమాప్తం

**ధమ్మకౌండిన్య –కొండాపూర్**

జూన్ మాసం నుండి ప్రతినెల 3 నుండి14 వరకు 10 రోజుల శిబిరాలు జరుగుతాయి. (ప్రస్తుతం కేవలం పురుషులకు మాత్రమే).


**తెలుగు పత్రిక సంవత్సరపుచందా పూర్తి అయిన సాధకులు రూ. 50 ఈ క్రింది చిరునామాకు పంపి పత్రికను పొందగలరు.**

**విపశ్యన తెలుగు మాసపత్రిక,**

**విపశ్యన అంతర్జాతీయ ధ్యాన కేంద్రం, నాగార్జున సాగర్ రోడ్, వనస్థలిపురం, హైదరాబాదు – 500 070. ఫోన్ : 2420290 (ఆశ్రమం).**

***(ఆఫీసు పనిచేయు వేళలు : ఉదయం 9 గం॥ల నుండి సాయంత్రం 5 గం॥ల వరకు)***

**PRINTED MATTER**

TO

If Underlivered please return to:
**VIPASSANA INTERNATIONAL MEDITATION CENTRE,**
12/3KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram,
HYDERABAD - 500 070.

Published for Vipassana International Meditation Centre, 12/3 KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram, Hyd. (A.P) -70. Ph : 040-24240290. Published by Smt. Sabrina Katakam.
Editor : Sri O. Premanand. Printed at Sai Likhita Printers, #6-2-959, Dakshin Bharat Hindi Prachar Sabha Complex, Khairatabad, Hyd. Ph : 23325979. RNI No. APTEL/2006/17745